రెరా కార్యదర్శి శివబాలకృష్ణపై

సస్పెన్షన్ వేటు

- **హెచ్ఎండీఏ మెట్రో పాలిటన్ కమిషనర్ దాన కిశోర్ ఉత్తర్వులు**

నాంపల్లి కోర్టులు, జనవరి 30 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో నిందితుడు, హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ ప్లానింగ్ అధికారి, హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్, రెరా కార్యదర్శి శివబాలకృష్ణపై సస్పెన్షన్ వేటు పడింది. హెచ్ఎండీఏ మెట్రో పాలిటన్ కమిషనర్ దాన కిశోర్ ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇటీవల శివబాలకృష్ణను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ప్రస్తుతం అతడు చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

8 రోజుల ఏసీబీ కస్టడీకి శివబాలకృష్ణ

మరోవైపు శివబాలకృష్ణను ఎనిమిది రోజుల ఏసీబీ కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. పది రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ పీపీ కోర్టును కోరగా, 8 రోజుల కస్టడీకి అప్పగిస్తూ జడ్జి మహ్మద్ అఫ్రోజ్‌అక్తర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. నిందితుడిని బుధవారం జైలు నుంచి ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారించనున్నారు. రాజకీయకోణంతోపాటు అవినీతి వెనుక ఉన్న వ్యక్తుల గురించి ఆరా తీయనున్నారు. రాజేంద్రనగర్‌లోని బాలకృష్ణ నివాసంలో రూ.99,60,850, నగదు, 1,988 గ్రాముల బంగారు ఆభరణాలు, 6 కిలోల వెండిని ఏసీబీ అధికారులు సీజ్ చేసినట్టు పీపీ గుర్తు చేశారు. నిందితుడి తరపు బంధువులు, స్నేహితులు, ఇతర సంస్థలతోపాటు 16 ప్రాంతాల్లో సోదాలు జరిపి కీలక పత్రాలతోపాటు రూ.5,96,27,495 విలువైన స్థిరాన్ని గుర్తించినట్టు తెలిపారు. నిందితుడు పొందిన ఆస్తుల గురించి విచారణ చేపట్టనున్నారు.

ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొన్ని రోజులుగా పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారా? లేక సర్పంచ్‌ల పదవీకాలాన్ని పొడగిస్తారా, పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తారా అన్న దానిపై ఉత్కంఠ కొనసాగింది. ఈ ఉత్కంఠకు తెరదించుతూ ప్రతి గ్రామ పంచాయతీకి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్పెషల్ ఆఫీసర్లు ఫిబ్రవరి 2న బాధ్యతలు స్వీకరించనున్నారు. కలెక్టర్ల నుంచి వచ్చిన ప్రతిపాదనల ప్రకారం గెజిటెడ్ అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించనున్నారు. ప్రస్తుత సర్పంచ్‌ల పదవీకాలం ఫిబ్రవరి ఒకటితో ముగియనుంది. ప్రభుత్వం పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే ప్రయత్నాలు చేయకపోవడంతో గ్రామ పరిపాలన స్పెషల్ అధికారుల చేతికి వెళ్లనుంది. ఎన్నికలు నిర్వహించే వరకు స్పెషల్ ఆఫీసర్లు కొనసాగనున్నారు. స్పెషల్ ఆఫీసర్లుగా ఆయా మండలాల్లోని ఎంపీడీవో, ఎంపీవో, తహిసీల్దార్, డిప్యూటీ తహసీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అగ్రికల్చర్, మండలంలోని ఇతర ఇంజినీర్లు, ఇతర శాఖల గెజిటెడ్ అధికారులను నియమించారు. ఎన్నికల య్యే వరకూ సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించాలని బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని కోరింది. సర్పంచ్‌ల సంఘం, సర్పంచ్‌లు కూడా ప్రభుత్వానికి విన్నవించారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన వ్యక్తం కాలేదు. గ్రామ సర్పంచ్‌ల అందరు బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉన్నారనే అక్కసు, స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తే గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల హవా సాగించవచ్చనే ఉద్దేశంతో స్పెషల్ ఆఫీసర్ల వైపు ప్రభుత్వం మొగ్గు చూపినట్టు పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన స్టార్ హాస్పిటల్ ఎండీ పద్మశ్రీ డాక్టర్ మన్నెం గోపీచంద్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గుడిపాటి రమేశ్

మారని ధోరణి.. అదే భాష..అదే తీరు

- **బీఆర్ఎస్‌పై మరోసారి సీఎం రేవంత్ అనుచిత వ్యాఖ్యలు**

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి తన స్థాయిని, హోదాను మరిచి భారత రాష్ట్ర సమితిపై విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పార్టీని బొంద పెడుతాం, బొక్కాబోర్లాపడ్డా బుద్ధిరాలేదు.. అంటూ ఆయన అనుచితంగా మాట్లాడారు. కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ కార్యాలయం గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశం అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పార్టీపైనా, పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావుపైనా అనుచితమైన భాషను ప్రయోగిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి స్థాయిలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు, మాట్లాడుతున్న భాష, బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావును బిల్లా-రంగా అంటూ సంభోదించడం వివాదం అవుతున్నా.. రేవంత్‌రెడ్డి ధోరణిలో మాత్రం మార్పు కనిపించలేదు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు బొందపెట్టారని, రాష్ట్రంలో ఆ పార్టీ చచ్చిపోయిందని అన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ పార్టీ మనుగడ కోసమే కాంగ్రెస్ పార్టీపై మాటల దాడి చేస్తున్నారని విమర్శించారు. ఓటమిని తట్టుకోలేక మతి తప్పి ఇష్టారీతిన విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తనను కలువడంలో తప్పులేదని రేవంత్‌రెడ్డి అన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు అడిగినా అపాయింట్‌మెంట్ ఇస్తానని చెప్పారు. నీటిపారుదల ప్రాజెక్టుపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ ప్రారంభమైందని వెల్లడించారు. బీసీ కులగణనకు త్వరలో ప్రారంభం కాబోయే శాసనసభ బడ్జెట్ సమావేశంలో తీర్మానం చేస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీల ప్రమాణానికి హైకోర్టు బ్రేక్

- **ఫిబ్రవరి 8 వరకు యథాతథ స్థితి**
- **మధ్యంతర ఉత్తర్వులు జారీ**
- **విచారణ మధ్యలో నియామకాలా?**
- **హామీ ఇచ్చాక ముందుకెలా వెళతారు?**
- **రాజ్‌భవన్‌కు హైకోర్టు సూటి ప్రశ్న**

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాలకు హైకోర్టు బ్రేక్ వేసింది. ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామక ప్రక్రియపై యథాతథ స్థితి కొనసాగించాలని మంగళవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. యథాతథస్థితి ఉత్తర్వులు ఫిబ్రవరి 8వ తేదీ వరకు అమల్లో ఉంటాయని ప్రకటించింది. ఈ ఉత్తర్వులతో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా నియమితులైన కోదండరాం, అమీర్ అలీఖాన్ ప్రమాణ స్వీకారానికి బ్రేక్ పడింది. కోర్టులో పిటిషన్ విచారణలో ఉండగా కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌ను ఎమ్మెల్సీగా గవర్నర్ నియమించడం పట్ల ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. పిటిషన్లు విచారణలో ఉండగా నియామక ప్రక్రియను ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించింది. తదుపరి విచారణ వరకు స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు ప్రకటించింది.

నమ్మకాన్ని వమ్ము చేశారు

పిటిషన్లు విచారణలో ఉండగా కోదండరాం, అలీఖాన్ అభ్యర్థిత్వాలను గవర్నర్ ఆమోదించారని పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. వ్యాజ్యాల విచారణ పూర్తయ్యే వరకు ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ చేపట్టబోమని గత విచారణ సమయంలో రాజ్‌భవన్ ప్రకటన చేసిందని గుర్తు చేశారు. దీంతో తమ ముందు వ్యాజ్యాలు విచారణలో ఉండగా నియామక ప్రక్రియను ఎలా కొనసాగిస్తారని అడ్వొకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డిని ధర్మాసనం ప్రశ్నించింది. అయితే, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేదని, గత విచారణ సమయంలో పరస్పర ఒప్పందంలో భాగంగా తదుపరి విచారణ వరకు.. అంటే ఈ నెల 24వ తేదీ వరకు నియామకాలు చేపట్టబోమని హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఈ హామీని పొడిగించాలని పిటిషనర్ల తరపు న్యాయవాది కోరలేదని.. అంటే, ఈ నెల 24 వరకే ఆ హామీ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యాక కోర్టులు జోక్యం చేసుకోడానికి వీల్లేదని, ప్రజాప్రాతినిధ్య చట్ట నిబంధనల ప్రకారం వెలువడిన నోటిఫికేషన్ నిలుపుదలకు కోర్టులకు అధికారం లేదని వాదించారు. దీనిపై పిటిషనర్ల తరపు మరో న్యాయవాది మయూర్‌రెడ్డి స్పందిస్తూ, కోర్టుకు ఇచ్చిన హామీకి విరుద్ధంగా నియామకాల విషయంలో గవర్నర్ ముందుకు వెళ్లారని ఆరోపించారు. ఇది నమ్మకానికి సంబంధించిన విషయమని, నమ్మకాన్ని వమ్ము చేశారని అన్నారు. నమ్మకం దెబ్బతినేలా చేసిన చర్యలను అడ్డుకోవాలని కోరారు. ఇరుపక్షాల వాదనల తర్వాత ఈ నెల 24న జరిగిన విచారణ సమయంలో అందరి అభిప్రాయాల తర్వాతే తదుపరి విచారణను ఫిబ్రవరి 8వ తేదీకి వాయిదా వేసినట్టు ధర్మాసనం గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో అప్పటికే ఇరుపక్షాల ఏకాభిప్రాయంతో ఇచ్చిన హామీ ఉండగా నియామకాల విషయంలో ముందుకు ఎలా వెళతారని ప్రశ్నించింది. ఎమ్మెల్సీల నియామకాల ప్రక్రియను నిలుపుదల చేయడం లేదని, అయితే, యథాతథస్థితి (స్టేటస్ కో) ఉత్తర్వులు జారీ చేస్తున్నామని వెల్లడించింది. ఉదయం విచారణ ముగిసిన తర్వాత మధ్యాహ్నం స్టేటస్ కో ఉత్తర్వులను వెలువరించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 8కి వాయిదా వేసింది.

విచారణలో ఉండగానే..

గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా కేసీఆర్ ప్రభుత్వం దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను సిఫారసు చేసింది. అయితే, వారికి రాజకీయ సంబంధాలున్నాయన్న కారణం చూపి గవర్నర్ తిరస్కరించారు. గవర్నర్ చర్య రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ దాసోజు, కుర్రా వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై గత విచారణ సమయంలోనే హైకోర్టు.. గవర్నర్ నిర్ణయంపై సమగ్ర విచారణ చేపడతామని ప్రకటించింది. సాంకేతిక అంశాల పేరుతో వ్యాజ్యాలపై విచారణ ముగించబోమని కూడా తేల్చి చెప్పింది. పిటిషన్ల విచారణార్హతతోపాటు గవర్నర్ నిర్ణయంపై న్యాయ సమీక్ష పరిధిపై కూడా విచారణ చేస్తామని వెల్లడించింది. ఆ పిటిషన్లపై ఫిబ్రవరి 8న తదుపరి విచారణ జరగాల్సి ఉండగా, కొత్త ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, సియాసత్ ఎడిటర్ అమీర్ అలీఖాన్ పేర్లను ప్రతిపాదించడం.. గవర్నర్ ఆమోదించటం చకచకా జరిగిపోయాయి. బుధవారం వారిద్దరు ప్రమాణస్వీకారం చేసేందుకు ఏర్పాట్లు కూడా జరిగాయి. ఎమ్మెల్సీ నియామక జీవో 12 ఈ నెల 27న వెలువడింది. ఈ జీవోను సవాల్ చేస్తూ పిటిషనర్లు మధ్యంతర పిటిషన్లను దాఖలు చేశారు. కోదండరాం, అమీర్ అలీఖాన్‌ను ప్రతివాదులుగా చేర్చాలన్న పిటిషన్లను సీజే జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది.

దేశానికి బీజేపీ ప్రమాదకరం

- **కేంద్రంలో మోదీ సర్కార్ విఫలం**
- **బీజేపీ హయాంలోనే అత్యధికంగా రైతుల ఆత్మహత్యలు**
- **ఎమ్మెల్యేలను కొని ప్రభుత్వాలను కూల్చడం ఆ పార్టీ నైజం**
- **అధికారంలోకి రాకుండా బీజేపీని అడ్డుకోగలిగేది కాంగ్రెస్సే**
- **రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక బాధ్యత అధిష్ఠానానిదే**
- **2న ఇంద్రవెల్లి సభతో లోక్‌సభ ఎన్నికల ప్రచారం ప్రారంభం**
- **గాంధీభవన్‌లో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): దేశానికి బీజేపీ ప్రమాదకరంగా పరిణమించిందని ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశ ప్రజల మీద వంద లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని దుయ్యబట్టారు. గాంధీభవన్‌లో మంగళవారం సాయంత్రం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశమైంది. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసిరేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రపంచంలో అత్యధికంగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నది మన దేశంలోనేనని, ఇదే మోదీ సాధించిన ఘనత అని దుయ్యబట్టారు. మణిపూర్‌లో జరిగిన ఘటనలు దేశాన్ని కుదిపేసినా ప్రధాని అక్కడికి వెళ్లలేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాలను కూల్చడం ఒక్కటే బీజేపీకి తెలుసునని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశంలో ప్రజాస్వామ్య మనుగడకు ముప్పుగా పరిణమించిన బీజేపీని గద్దె దింపడం కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికే సాధ్యమని చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు, బీజేపీకి మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నా, రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నా రాష్ట్రంలో 17కు 17 లోక్‌సభ స్థానాలు గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే కేంద్రం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరుతాయని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని ఆరోపించారు. ఇరుపార్టీల మధ్య చీకటి ఒప్పందం ఉన్నదని అన్నారు. దీనిని ప్రజలు ఎక్కడ గుర్తిస్తారోనన్న భయంతోనే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌పై ఎదురుదాడి చేస్తున్నారని చెప్పుకొచ్చారు. బీజేపీని పల్లెత్తు మాట అనకుండా కాంగ్రెస్‌ను మాత్రమే టార్గెట్ చేయడంలో.. బీఆర్ఎస్-బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు అర్థం అవుతున్నాయని ఆరోపించారు. ఈ దేశంలో ఓడించాల్సిన మోదీని వదిలేసి వారు కాంగ్రెస్‌ను టార్గెట్ చేయడంలో ఏమైనా అర్థం ఉందా? అని ప్రశ్నించారు. పార్టీల ఫిరాయింపులు, అప్పులలో కేసీఆర్, మోదీ ఒక్కటేనని విమర్శించారు.

రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక ఏఐసీసీకే

రాష్ట్రం నుంచి ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలకు పోటీచేసే అభ్యర్థుల ఎంపిక బాధ్యతను ఏఐసీసీకి అప్పగిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అధిష్ఠానం అభ్యర్థులను ఖరారు చేస్తుందని చెప్పారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో పోటి చేయాలనుకొనే ఆశావాహుల నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఆ దరఖాస్తులను వడబోసి అభ్యర్థులను ఎంపిక చేసేది కూడా కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీనే అని చెప్పారు. మరో 60 రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పారు. ఇంద్రవెల్లిలో ఫిబ్రవరి 2న నిర్వహించే భారీ బహిరంగసభతో లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. తెలంగాణ నుంచి పోటీ చేయాలని సోనియాగాంధీని కోరామని చెప్పారు. ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకొని, తెలంగాణ రాష్ట్రం ఇచ్చినందుకు కృతజ్ఞత చెప్పుకోవాలని అన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన కోదండరాం ప్రమాణ స్వీకారం చేయకుండా రాజకీయ కుట్రతో అడ్డుకున్నారని ఆరోపించారు.

డిస్కంలలో తాత్కాలిక డైరెక్టర్ల నియామకం!

- **డైరెక్టర్లుగా చీఫ్ జనరల్ మేనేజర్లు**
- **ఉత్తర్వులు జారీచేసిన సీఎండీలు**

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రెండు విద్యుత్తు పంపిణీ సంస్థ(డిస్కం)ల్లో మొత్తం ఏడుగురు డైరెక్టర్లను తాత్కాలికంగా నియమించారు. పూర్తిస్థాయి డైరెక్టర్లను నియమించి, వారు బాధ్యతలు స్వీకరించేంత వరకు వీరు సంస్థల కార్యలాపాలను నిర్వహిస్తారని రెండు డిస్కంల సీఎండీలు మంగళవారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్)లో సీజీఎంగా ఉన్న కే రాములును డైరెక్టర్ కమర్షియల్, ఐపీసీ అండ్ ఆర్ఏసీగా, ప్రాజెక్ట్స్ సీజీఎం కే నందకుమార్‌ను డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటీ, ఈఏ, డీపీఈ అండ్ అసెస్‌మెంట్స్)గా, సీజీఎంగా ఉన్న ఎన్ నర్సింహులును డైరెక్టర్ (ఆపరేషన్స్, పీ అండ్ ఎంఎం)గా, సీజీఎం కే సుధామాధురిని డైరెక్టర్ (ఫైనాన్స్, హెచ్ఆర్ అండ్ ఐఆర్)గా నియమిస్తూ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తర ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్)లో సీజీఎంగా ఉన్న టీ సదర్‌లాల్‌ను డైరెక్టర్ (ప్రాజెక్ట్స్)గా, సీజీఎం వీ మోహన్‌రావును డైరెక్టర్ (ఆపరేషన్స్)గా, సీజీఎం బీ అశోక్‌కుమార్‌ను డైరెక్టర్ (హెచ్ఆర్‌డీ అండ్ ఐఆర్)గా నియమిస్తూ సీఎండీ కే వరుణ్‌రెడ్డి ఉత్తర్వులిచ్చారు.

కోదండను ఇరికించిన రేవంత్

ఎమ్మెల్సీ ఇచ్చినట్టే ఇచ్చి.. 'లీగల్' పెండింగ్

పదవులపై 3వ తేదీ నుంచే హైకోర్టులో కేసు

- **ముగిసేదాకా కొత్త పేర్లు వద్దన్న గవర్నర్**
- **వారంలోనే మాట మార్చిన రాజ్‌భవన్**
- **కోదండరాం, అమీర్‌అలీఖాన్ పేర్లు ఖరారు**
- **'మంత్రిపదవి' ఒత్తిడి నుంచి తప్పించుకునేందుకే?**
- **కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని అనుమానాలు**

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి తెలివిగా ఆడిన రాజకీయ చదరంగంలో కోదండరాం త్రిశంకు స్వర్గంలో ఇరుక్కుపోయారు. 'పదవి ఇచ్చినట్టు ఉండాలి.. కానీ అధికారంలో ఉండకూడదు' అనే తరహాలో రేవంత్ వేసిన స్కెచ్‌కు కోదండరాంకు పంచ్ పడింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కోదండరాంకు ఎమ్మెల్సీ ఇవ్వాలని, మంత్రి పదవి అప్పగించాలని వివిధ వర్గాల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి వస్తున్నది. విద్యాశాఖ మంత్రి పదవి ఇస్తారంటూ ప్రచారం కూడా సాగుతున్నది. ఈ నేపథ్యంలో వీటన్నింటికీ రేవంత్‌రెడ్డి ఒకే ఎత్తుతో చెక్ పెట్టారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవుల భర్తీకి కేసీఆర్ ప్రభుత్వం నిరుడు ఆగస్టు 1న డాక్టర్ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పేర్లను ఖరారుచేసింది. ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపగా.. గవర్నర్ దాదాపు 55 రోజులు నిర్ణయం తీసుకోలేదు. వారిద్దరి పేర్లను సెప్టెంబర్ 25న తిరస్కరించారు. వారిద్దరూ రాజకీయ నేపథ్యం ఉన్నవారనే కారణంతో తిరస్కరిస్తున్నట్టు చెప్పారు. దీంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టులో తీర్పు వచ్చే వరకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు సాధ్యం కాదని ప్రతి ఒక్కరికీ అర్థమైంది. కానీ, రేవంత్‌రెడ్డి ఇక్కడే తన రాజకీయ చతురతను ప్రదర్శించి కోదండరాంను అడ్డంగా ఇరికించేశారు. 'రాజకీయంగా'.. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నట్టు చెప్పుకుంటూనే పదవిలోకి రాకుండా 'సాంకేతికంగా' అడ్డుకున్నారు. గత నెల రోజుల్లో జరిగిన పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

గౌరవ ఒప్పందం ఏమైంది?

కోర్టు తీర్పు వచ్చేవరకు ఎలాంటి కొత్త ప్రతిపాదనలు తీసుకోబోనని గవర్నర్ స్పష్టం చేశారు. ఈ మేరకు న్యాయస్థానంతో 'గౌరవ ఒప్పందం' చేసుకున్నారు. ఈ నెల 24న జరిగిన వాదనల్లోనూ 'కోర్టులో వివాదం తేలేదాకా ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని గవర్నర్ నిర్ణయించారు' అని గవర్నర్ తరపు న్యాయవాది ధర్మాసనానికి స్పష్టంచేశారు. దీనిని బట్టే.. కోర్టు తీర్పు వచ్చే వరకు ఎమ్మెల్సీ పదవులు చేపట్టడం అసాధ్యమని అర్థమైపోయింది. ఒకవేళ ఎవరినైనా నియమించినా న్యాయవివాదం తప్పదని తేలిపోయింది. కానీ కోదండరాంను ప్రభుత్వంలోకి తీసుకోవాలని వస్తున్న ఒత్తిడులను తప్పించుకోవడానికి రేవంత్ చక్రం తిప్పారని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. కేవలం ఒక్క రోజులోనే గవర్నర్ మాట మార్చి, ఇద్దరి పేర్లను ఖరారు చేయడమే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ వివాదం హైకోర్టులో సమసిపోకుండా సుప్రీంకోర్టు వరకు వెళ్తే.. ఎప్పుడు పరిష్కారం అవుతుందో తెలియదు. కాబట్టి అప్పటి వరకు కోదండరాం పదవులకు దూరంగా ఉన్నట్టేనని స్పష్టం చేస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందం!

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని ఎమ్మెల్సీ పదవుల అంశంతో మరోసారి రుజువైందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. రాజకీయాలతో సంబంధం ఉన్నదనే కారణంతో దాసోజు, కుర్రా అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తిరస్కరించారని గుర్తుచేస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో ఐదుగురు రాజకీయ నేతలను ఎమ్మెల్సీలుగా నియమించారని చెప్తున్నారు. అలాంటిది ఏకంగా ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడి పేరును ఎలా ఖరారు చేశారని ప్రశ్నిస్తున్నారు. రెండు పార్టీల మధ్య ఒప్పందానికి ఇది తొలి నిదర్శనమని విమర్శిస్తున్నారు. కోర్టు తీర్పు వచ్చే వరకు కొత్త ప్రతిపాదనలు తీసుకోబోమని ఈనెల 17న ప్రకటించిన గవర్నర్.. వారం వ్యవధిలోనే ఎందుకు మాట మార్చారని అడుగుతున్నారు. తీర్పు వచ్చేవరకు వేచి చూస్తామని ఈనెల 24న కూడా కోర్టులో చెప్పారని, 24 గంటల్లోనే ఇద్దరి పేర్లను ఎందుకు ఖరారుచేశారని ప్రశ్నిస్తున్నారు. ఇది కచ్చితంగా బీజేపీ, కాంగ్రెస్ మధ్య లోపాయకారి ఒప్పందానికి నిదర్శనమని చెప్తున్నారు.

24 గంటల్లోనే గవర్నర్ నిర్ణయం మార్పు

- ***జనవరి 3:*** *మంత్రిమండలి చేసిన సిఫార్సులను గవర్నర్ తిరస్కరించడానికి వీలులేదని దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు.*
- ***జనవరి 5:*** *పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ సూరేపల్లి నందనతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తదుపరి విచారణను 24కు వాయిదా వేసింది.*
- ***జనవరి 17:*** *'హైకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందువల్ల తీర్పు వచ్చే వరకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం చేపట్టబోమని రాజ్‌భవన్, హైకోర్టు మధ్య గౌరవ ఒప్పందం (జెంటిల్మన్ అగ్రిమెంట్) కుదిరింది. కాబట్టి ఎలాంటి కొత్త ప్రతిపాదనలు స్వీకరించవద్దని గవర్నర్ నిర్ణయించారు' అని రాజ్‌భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది.*
- ***జనవరి 24:*** *పిటిషన్‌పై సమగ్ర విచారణ చేపడుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ధర్మాసనం ఫిబ్రవరి 8కి వాయిదా వేసింది.*
- ***జనవరి 25:*** *గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లకు గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. 27న ఉత్తర్వులు వెలువడ్డాయి.*

రథయాత్రపై బీజేపీ ఊగిసలాట

5, 10 తేదీల్లో ప్రారంభంపై డైలమా

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో బీజేపీ చేపట్టనున్న రథయాత్ర షెడ్యూల్‌పై ఊగిసలాట నెలకొన్నది. వచ్చే నెల 5 నుంచి రథయాత్రలు ప్రారంభించాలని గతంలో ఆ పార్టీ నేతలు భావించారు. బడ్జెట్ సమావేశాలు, ఇతర కారణాలతో దానిని 10వ తేదీకి మార్చారు. జనగాంలో రథయాత్ర ప్రారంభించాలని, 19వ తేదీ వరకు కొనసాగించాలని తొలుత భావించారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో జాతీయ కార్యవర్గ సమావేశాలను నిర్వహిస్తున్నట్టు బీజేపీ అదిష్ఠానం ప్రకటించింది. ఆ సమావేశాలకు రాష్ట్ర నాయకత్వంతో పాటు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కనీసం 200 మంది నేతలు తరలివెళ్లాల్సి ఉంటుంది. అనుకున్న ప్రకారం ఒకవ